క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఏఎస్పీ



శ్రీవారి ఆలయంలో పూజ చేస్తున్న ఏఎస్పీ భాస్కరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఏలూరు జిల్లా నూతన అడిషినల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు మంగళవారం రాత్రి సందర్శించారు. శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆయన వెంట స్థానిక ఎస్సై టి.సుధీర్ ఉన్నారు.

గంగానమ్మవారికి పాన్పుల పూజ



పొంగుటూరులో ఓ ఇంటి వద్ద గంగానమ్మవారికి వేసిన పాన్పు

కొయ్యలగూడెం: మండలంలోని పొంగుటూరు గ్రామ దేవత గంగానమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రైతుల ఇళ్ల వద్ద అమ్మవారికి పాన్పు కార్యక్రమం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. జాతర రోజుల్లో ఆహ్వానించే ప్రతి ఇంటికీ వెళ్లి అమ్మవారు కలశ, గరగ రూపంలో పాన్పుల పూజ చేస్తున్నారు. ఈ పూజ వల్ల ఆయా కుటుంబాలకు అమ్మవారి కృపకు చేరువవుతుందని గణాచారులు చెబుతున్నారు. గురువారం రాత్రి జబర్దస్త్ టీం ఆర్టిస్టుల వినోద కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు జాతర నిర్వాహకులు తెలిపారు.

శ్రీవారి సేవలో కేరళ ఏపీపీఎస్సీ సభ్యులు



శ్రీవారి ఆలయంలో పూజ చేస్తున్న ఏపీపీఎస్సీ సభ్యులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కేరళ రాష్ట్రం ఏపీపీఎస్సీ సభ్యులు బుధవారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. చినవెంకన్న మెమెంటోలను అందజేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన సి.జయచంద్ర, కె.ప్రకాశన్, కె.సాబ్జి, జిప్సన్ పాల్‌కు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై టి.సుధీర్ ఉన్నారు.

గురుకులంలో ఎనిమిది మందికి సీటు



వేల్పుల రోషన్

టి.నరసాపురం: మండలంలోని చిన్న గుర్వాయిగూడెం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటారని ఎంఈఓ టి.రామ్మూర్తి తెలిపారు. ఈ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఎనిమిది మందికి సీటు లభించిందన్నారు. మండల స్థాయిలో 50కి 46 మార్కులు సాధించిన వేల్పుల రోషన్‌ను హెచ్‌ఎం పీఎస్ కల్యాణి, ఎంఈఓ టి.రామ్మూర్తి, కాంప్లెక్స్ చైర్మన్ నర్సమాంబలు అభినందించారు. ఆయా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన హెచ్‌ఎం కల్యాణిని పలువురు ప్రశంసిస్తున్నారు.

ట్రాక్టర్, రోటవేటర్ల అందజేత



రైతులకు ట్రాక్టర్‌ను అందజేస్తున్న బాబ్జి, శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం రైతు భరోసా కేంద్రం వద్ద వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వ్యవసాయ పరికరాలను అందజేశారు. జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావుల చేతుల మీదుగా వైఎస్ విజయమ్మ సీహెచ్‌సీ గ్రూప్ రైతులకు ట్రాక్టర్, 3 రోటవేటర్లను అందజేశారు. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ పోశారావు, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ సంతోషి పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



పోలవరం గ్రామ పంచాయతీ వద్ద వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్ల వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయడంతో వలంటీర్లు ఎంతో కృషిచేస్తున్నారని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలుస్తున్నారని కొనియాడారు. ఉత్తమ సేవలు అందిస్తోన్న వలంటీర్లను గుర్తించి ప్రభుత్వం వారికి అవార్డులు అందజేయడంలో వారి బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. పోలవరం మండలం నుంచి సేవా వజ్ర ఒకరు, సేవ రత్న ఐదుగురు, సేవ మిత్ర 211 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పాదుం పుష్ప, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎంపీటీసీలు మిడియం సింగరాజు, యామల శ్రీదేవి, సోమరౌతు అనితకుమారి, కాశీ ధనలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దత్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రిలే దీక్షలు

చింతలపూడి: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. చింతలపూడిలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ శిబిరంలో నల్లా అప్పారావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, డీఏ ఎరియర్స్ తక్షణ చెల్లింపు, 12వ వేతన సవరణ తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి రవాణా అరికట్టాలి

కొయ్యలగూడెం: మండలంలో పలుచోట్ల అక్రమంగా చేస్తున్న మట్టి రవాణాను అరికట్టాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రైతు కూలీ సంఘం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించింది. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి సముద్రాల సుందర్‌రావు, అధ్యక్షుడు కాళీ బాబు, ఉపాధ్యక్షుడు కలింపూడి సుందర్రావు, బోడా యేసుపాదం ప్రకటన చేసిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు



జంగారెడ్డిగూడెంలో చదరంగం పోటీలు



ధర్మాజీగూడెంలో విద్యార్థులు వేసిన బొమ్మలు



క్యారమ్స్‌పై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి భీమరాజు

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం చదరంగం శిక్షణ నిపుణుడు చంద్రశేఖర్ పర్యవేక్షణలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. సుమారు 20 మంది పాల్గొన్నారు. విజేతలకు శిక్షణా తరగతుల అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి పి.దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సేవకులు, విశ్రాంతి ఉపాధ్యాయులు ఎండీ ఉమర్‌అలీ, శిరీషా, పాఠశాల వి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో బొమ్మల తయారీ

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో రంగురంగుల కాగితాలు, అట్టపెట్టెలతో బొమ్మలు తయారు చేయించినట్టు గ్రంథాలయాధికారిణి వి.రమణ తెలిపారు.

క్యారమ్స్‌పై శిక్షణ

కామవరపుకోట: స్థానిక కామవరపుకోట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారం బోర్డుపై శిక్షణ ఇచ్చామని, పుస్తక పఠనం చేయించి, నీతి కథలు చదివించామని గ్రంథాలయాధికారి ఎం.భీమరాజు తెలిపారు. సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో గిరిజన దర్బారు



పీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బారులో ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణకు పలువురు వినతిపత్రాలను అందజేశారు. అలివేరు పంచాయతీ పరిధిలో వర్షాలకు పాడైన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ సర్పంచ్ కారం లక్ష్మి ఆధ్వర్యంలో ఏఐకేఎమ్ఎస్ నాయకులు కారం రాఘవ పీవైఎల్ నాయకులు టి. బాబూరావు, కె.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్‌లు పీఓకు వినతిపత్రం అందజేశారు. బుట్టాయగూడెం మండలం మర్రిగూడెంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు సముద్రాల సుందరరావు ఆధ్వర్యంలో నాయకులు సాలి రాజశేఖర్, కాళీ బాబు, బోడా ఏసుబాబు, మర్రిగూడెం గ్రామస్థులు పీఓకు వినతిపత్రం అందజేశారు.

ఐటీడీఏ వద్ద ధర్నా

గిరిజనులు పోడు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఐటీడీఏ వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పీఓకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కృష్ణ చైతన్య, కంచర్ల గురవయ్య, సాయిబాబా, పిట్టా ప్రసాద్, డేగా ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నీరు, ఉప్పును ప్రతినెలా పరీక్షించాలి



నందాపురంలో మాట్లాడుతున్న స్నేహాస్

బుట్టాయగూడెం: ఆరోగ్య లక్ష్యం సాధించడానికి ప్రజలు వాడే నీరు, ఉప్పును ప్రతినెలా పరీక్షించే విధంగా గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం పని చేయాలని సచివాలయాలశాఖ సామాజిక పరివర్తన మార్పు, సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎస్ స్నేహాస్ అన్నారు. బుట్టాయగూడెం మండలం నందాపురం పీహెచ్‌సీలో బుధవారం మెడికల్ ఆఫీసర్ కేఎస్‌ఆర్ సుధాకర్ అధ్యక్షతన గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. స్నేహాస్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో మూడో లక్ష్యం అందరికీ ఆరోగ్యం అందించడమన్నారు. ఈ దిశగా కమిటీలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ సల్మా సుల్తాన, సూపర్‌వైజర్లు నాగమణి, సరస్వతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.పద్మ జ్యోతి, గ్రామ సామాజిక ఆరోగ్య అధికారులు ఏఎస్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలుంటేనే కుల ధ్రువీకరణ జారీ



కుల ధ్రువీకరణ పత్రం జారీపై విచారణ చేస్తున్న ఆర్డీఓ ఝాన్సీ రాణి

కామవరపుకోట: సరైన ఆధారాలు ఉంటేనే కుల ధ్రువీకరణ పత్రం ఇస్తామని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి అన్నారు. ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరుతూ ఇటీవల ఏలూరులో స్పందన కార్యక్రమంలో స్థానిక కొండగూడెం గ్రామానికి చెందిన భోగం మల్లేశ్వరి దరఖాస్తు చేశారు. దీనిపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ విచారణ చేపట్టారు. బదిలీ సర్టిఫికెట్లో నాయక్ అని ఉన్నా, ఎస్టీ, ఎస్సీలని నమోదు కాలేదని, కుల మూలాధారాలు ఉంటేనే కుల ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారని ఆర్డీఓ భోగం మల్లేశ్వరికి, గ్రామస్తులకు వివరణ ఇచ్చారు. అధికారులు పెద్దలు, గ్రామస్తులను విచారించగా మల్లేశ్వరి కులం వాల్మీకి బోయిగ తెలిపారని చెప్పారు. తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, గ్రామస్తులు పండు జగదీష్, మల్ల నాగేశ్వరరావు, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న సీనియర్ సిటిజన్స్ మండల కార్యవర్గం

ద్వారకాతిరుమల: వృద్ధుల సంక్షేమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. స్థానిక బ్రాహ్మణ నిత్యాన్నదాన సదనంలో మండల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏలూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత మండల గౌరవాధ్యక్షుడిగా మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా బలుసు చినవీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా గంజి కాశీవిశ్వనాథం, యిమ్మడి రామ్మోహన్‌రావు, కార్యదర్శిగా నాదెళ్ల బుల్లి వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పావులూరి మధుసూదనరావు, జాయింట్ కార్యదర్శిగా బలుసు పెద్దవీరభద్రరావు, కోశాధికారిగా బొప్పన వెంకటేశ్వరరావు, సభ్యులుగా దేవరపల్లి రాయుడుబాబు చౌదరి, తూంపాటి సత్యన్నారాయణ, గారపాటి మల్లేశ్వరరావు, పోలిన లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. వీరితో నారాయణమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్కున్నూరి రామచంద్రరావు మాట్లాడుతూ వృద్ధుల సమస్యల పరిష్కారానికి ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం



ర్యాలీ నిర్వహిస్తున్న కొయ్యలగూడెం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

కొయ్యలగూడెం: జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా కొయ్యలగూడెం పీహెచ్‌సీలో స్కిజోఫెనియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక ఆరోగ్య నిపుణుడు డాక్టర్ హన్నా కోమలి మాట్లాడుతూ స్కిజోఫెనియా అనేది ఒక మానసిక రుగ్మత అన్నారు. చెవిలో మాటలు వినిపించడం, గుర్తు తెలియని వినికిడి, ఒకో సారి రోగిని చనిపోవాలని ఆదేశిస్తున్నట్టు వినిపించడం ఈ ఆదేశాలు పాటించి రోగి ఆత్మహత్యలు చేసుకోవడం స్కిజోఫెనియా లక్షణాలన్నారు. వినిపించే మాటలు ఆనందకరమైనవయితే రోగి నవ్వుకుంటాడని, బాధాకరమైనవి అయితే ఏడుస్తుంటాడని, ఆ సమయంలో ఇతరులపై దాడి చేస్తాడని వివరించారు. కొయ్యలగూడెం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మంజూషా, సైకాలజిస్ట్ శ్రీనివాస్, సోషల్ వర్కర్ తిరుపతి స్వామి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): వేస్ట్ పిక్కర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని మెప్మా టెక్నికల్ కోఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద వేస్ట్ పిక్కర్స్, ప్రభుత్వ అధికారుల ముఖాముఖి కార్యక్రమం బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏలూరు కోఆర్డినేటర భలే సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పొదుపు చేసుకుని తద్వారా అభివృద్ధి, గౌరవం పొందాలన్నారు. ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఏపీఓ నాయుడు మాట్లాడుతూ పిల్లలను చదివించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగరు బాట వేయాలని సూచించారు. పిల్లల ఆధార్ సమస్యలు, స్కూల్ ఎన్రోల్మెంట్, హాస్టల్స్ సదుపాయాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారి ఎ.వరప్రసాద్ మాట్లాడుతూ యానాదుల కుటుంబాలలో చేపలు పట్టుకుంటున్న వారికి లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ ఉచితంగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి, ట్రెనింగ్ కోఆర్డినేటర్ హేమలత, ఏఈ పి.శ్రీనివాస్, డీబీఆర్‌సీ సిబ్బంది జి.ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పోలవరం నుంచి పాదయాత్ర

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిధుల కోసం, నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీ తదితర సమస్యల పరిష్కారానికి త్వరలో పోలవరం నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ చెప్పారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో బుధవారం సాయంత్రం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించి, పోలవరం ప్రాజెక్టు కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ఈనెల 28న విజయవాడలో సమావేశమై పాదయాత్రపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఎకరాకు రూ.5 లక్షలు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి బదులు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కార్మిక సభ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ కార్మికులకు న్యాయమైన పరిష్కారం చేయకుండా మిల్లు ఆస్తులపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయబోతున్న యాజమాన్య చర్యను ఖండిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించే కార్మిక సభను విజయవంత చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక కొత్తూరు జూట్ మిల్లు వద్ద బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక రామకృష్ణాపురం సాహితి మండలిలో నిర్వహించే కార్మిక సభకు కార్మికులంతా హాజరవ్వాలన్నారు. కార్మికులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

ఆడపిల్ల పుట్టిందని అత్తింటి వేధింపులు

చింతలపూడి: ఆడపిల్ల పుట్టిందని భర్త, అత్తింటివారు తనను వేధిస్తున్నారని వివాహిత బుధవారం ఫిర్యాదు చేసిందని ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. చింతలపూడికి చెందిన దాసరి మంజులకు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన జగన్నాథంతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి తొలి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో మగపిల్లవాడు కావాలంటూ భర్త, అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తలసేమియా బాధితులను ఆదుకోవాలి

ఏలూరు టౌన్: తలసేమియా చిన్నారులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం తొమ్మిది మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. రక్తమార్పిడి చికిత్స పొందుతున్న చిన్నారులను రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో సుమారుగా 37 శాతం మంది రక్తదానం చేసేందుకు అర్హత కలిగినవారు ఉండగా కేవలం 10 శాతం మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారని తెలిపారు. రక్తదానంపై ప్రజల్లో సరైన అవగాహన లేదన్నారు. రక్తదానంపై అపోహలు, భయాలు విడిచిపెట్టి స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. తలసేమియా చిన్నారులు, వారి సహాయకులకు, తల్లిదండ్రికి సుమారుగా 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన సత్యసాయి సేవా సమితికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నేడు ఉచిత మెగా మెడికల్ క్యాంపు

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా మెడికల్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, శంకు కొండ తెలిపారు. అపోలో ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఉదయం ఎనిమిది నుంచి రెండు గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అధునాతన పరికరాలతో ఛాతి ఎక్స్ రే, బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

శ్మశానాలను ఆక్రమిస్తే చర్యలు



తడికలపూడి శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: శ్మశానాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామపంచాయతీ పరిధిలోని శ్మశానవాటిక ఆక్రమణకు గురై ముళ్ల కంచెలతో అసౌకర్యంగా ఉందని గ్రామస్తులు జెడ్పీటీసీ రమేష్ దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడారు. పనులు ప్రారంభించారు. శ్మశాన వాటిక ఆక్రమణలను విడనాడాలని జెడ్పీటీసీ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొప్పర్తి లక్ష్మి, నాగేంద్ర, గంగుల కడియాలు, ఉప సర్పంచ్ విష్ణు, మేరుగు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



స్వర్ణవారిగూడెంలో సచివాలయ సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలని డీఎల్‌డీఓ ఎం.రాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం, వంకవారిగూడెం, పి.రాజవరం సచివాలయాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది, వలంటీర్ల వివరాలను డిజిటల్ అసిస్టెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన మినీ మహానాడు



మినీ మహానాడు సభా ప్రాంగణంలో ఖాళీ కుర్చీలు

కామవరపుకోట: నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా మండలంలోని రాఫిన్ రియల్ ఎస్టేట్ ఆవరణలో టీడీపీ ఆధ్వర్యంలో ప్రత్తిపాటి పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన మినీ మహానాడు ఆశించినంతగా శ్రేణులు రాకపోవడంతో వెలవెలబోయింది. స్టేజిపై నాయకులు కనిపించినా, ఏడు నియోజకవర్గాల నుంచి ఆశించిన స్థాయిలో శ్రేణులు హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. నాయకులు సీఎం జగన్ మోహన్‌రెడ్డిని వారి కుటుంబ సభ్యులను విమర్శించడం తప్ప, కనీసం రాష్ట్ర ప్రజల సంక్షేమం గూర్చి మాట్లాడకపోవడంతో వచ్చిన కొద్దిమంది జనం కూడా జారుకున్నారు. ప్రారంభమైన కొద్ది సమయంలో మినీ మహానాడు ముగించడంతో టీడీపీ కార్యకర్తల్లో సైతం నిరుత్సాహం అలముకుంది.

పట్టిసీమలో 'లైఫ్'

పోలవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, సంరక్షించాలని అటవీ శాఖ ఎఫ్ఎస్ఓ బి.ప్రసాద్ అన్నారు. పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలో లైఫ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని సహకరించాలని కోరారు.